# ఆశ చావని మనిషి

అప్పుడే ఇంట్లోకి అడుగుపెట్టిన భర్తను చూసి " ఏమండోయ్... మీకు వుత్తరం వచ్చింది" అంది లలిత.

"ఆఫీసులో చాకిరీ చేసి చేసి అలిసిపోయి కొంప చేరుకున్న భర్తకు ఓ గ్లాసెడు మంచినీళ్ళో... ఓ కప్పు వేడికాఫీనో అందించాల్సిందిపోయి... ఇంట్లోకి అడుగు పెట్టగానే టెలిగ్రాం వచ్చిందనో... వుత్తరం వచ్చిందనో... ఎవరో చచ్చారనో... అంటూ మాట్లాడటం ఏమీ బాగోలేదు..." ఈజీ ఛైర్లో నడుము వాలుస్తూ చిరాకుపడ్డాడు వాసుదేవరావు.

"సరేలెద్దురూ సంబరం!... ఇరవైయ్యేళ్ళు కలిసి మీతో కాపురం చేశాక కూడా ఇంకా మీ మురిపాలు నేనెక్కడ తీర్చను?..." దీర్ఘాలు తీస్తూ వంటింట్లోకెళ్ళి కప్పులో కాఫీ పోసుకొచ్చి భర్తకు అందించింది లలిత.

భార్య అందించిన కప్పు అందుకుని కాఫీ చప్పరిస్తూ "ఏదీ ఆ వుత్తరం...?" అడిగేడు వాసుదేవరావు.

పక్కనవున్న గూటిలో కవరు తెచ్చి అందించింది.

"నువ్వీ వుత్తరాన్ని చించి చదవటం కూడా అయిందేమిటీ?..." కనుబొమలెగరేస్తూ అడిగేడు వాసుదేవరావు.

మారుమాట్లాడలేదు లలిత.

"నీకు లక్షసార్లు చెప్పాను... ఇంటికి నా పేరున వుత్తరాలొస్తే చదవద్దూ అని..." విసుక్కున్నాడు వాసుదేవరావు.

"నాకు తెలియకూడని రహస్యాలేముంటాయ్ గనక..." మూతి ముప్పైవంకర్లు తిప్పింది లలిత.

"అయితే నేను చదవటం కూడా దేనికి? అందులో ఏం వ్రాసి వుందో... ఎవరు వ్రాశారో నువ్వే చెప్పరాదూ?" దెప్పి పొడుస్తూ మాట్లాడేడు వాసుదేవరావు.

"ఇంకెవరు?... మీ తమ్ముడు వ్రాశాడు!"

"ఏమిటి విశేషం...?"

